క్లుప్తంగా

కుసుమ హరనాథుల మాసోత్సవం

నల్లకుంట: నల్లకుంట టీఆర్టీ కాలనీలోని శ్రీ కుసుమ హరనాథ ఆశ్రమంలో కుసుమ హరనాథుల మాసోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు కుసుమ హరనాథులకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్న దాన వితరణ జరిగింది. ఆశ్రమ పాలక మండలి సభ్యులతో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బీఎస్పీ సభకు తరలిన నేతలు



బైక్ ర్యాలీలో బీఎస్పీ ముషీరాబాద్ నియోజకవర్గ నేతలు

కవాడిగూడ: బీఎస్పీ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ భరోసా సభకు ముషీరాబాద్ నియోజకవర్గ బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు కవాడిగూడ డివిజన్ ఎన్టీఆర్ స్టేడియం నుంచి బైక్ ర్యాలీతో బయలుదేరారు. ఆదివారం జరిగిన కార్యక్రమానికి బీఎస్పీ సికింద్రాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ పోచగారి నరేందర్, మైనార్టీ కన్వీనర్ అబ్రార్ హుస్సేన్, షఫీ, బాలరాజు, బండారు శ్రీనివాస్, నందకుమార్, సత్యనారాయణ, పరమేశ్వర్, రమేష్, యజమాజ్, రాజేందర్, ప్రవీణ్, రజిత, చైతన్య, సుమలత తదితరులున్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్

కాచిగూడ: హిమాయత్‌నగర్ డివిజన్, విఠల్‌వాడిలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆదివారం స్థానిక కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ నేతలు రామన్‌గౌడ్, నర్సింగ్ గౌడ్, జైస్వాల్, పద్మజ, హితేష్, ఎంబీరావు తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సల్ హెచ్‌ఆర్ సౌత్ ఇండియా చైర్‌పర్సన్‌గా ధనలక్ష్మి



కాచిగూడ: 'యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ సౌత్ ఇండియా' చైర్‌పర్సన్‌గా ధనలక్ష్మిని నియమిస్తూ.. యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ నేషనల్ ప్రెసిడెంట్ ఆరుట్ల అంజిరెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు.

ఘనంగా రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి

లిబర్టీ: సాహిత్య రంగంలో ప్రపంచవ్యాప్తంగా పేరుపొందిన గొప్ప రచయిత రవీంద్రనాథ్ ఠాగూర్ అని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు కె.బి.శ్రీధర్ అన్నారు. ప్రపంచంలోనే రవీంద్రనాథ్ ఠాగూర్ రచయితగా మంచి గుర్తింపు పొందారని పేర్కొన్నారు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి పురస్కరించుకుని లిబర్టీ వద్ద ఉన్న పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర ఉద్యమం ఉవ్వెత్తుగా సాగుతున్న క్రమంలో జనగణ గీతాన్ని రచించి దేశ ప్రజల హృదయాలను ఉత్తేజాన్ని నింపారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసుదేవరావు, అరుణరెడ్డి, నంది కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల వేతనాలు చెల్లించండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కాలేజీలు, గురుకుల విద్యా సంస్థల్లో పని చేస్తున్న అతిథి అధ్యాపకులకు నెలసరి వేతనాలు చెల్లించాలని తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కిశోర్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్య సంస్థల్లో పేద విద్యార్థులకు బోధిస్తున్న అతిథి అధ్యాపకులకు కేవలం 72 గంటల వేతనం చెల్లించడం దారుణమన్నారు. అధ్యాపకులకు చెల్లించే వేతనాలు కుటుంబ అవసరాలు తీరక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

గుంతల్.. చింతల్ !

- గుంతలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- అధ్వానంగా అంతర్గత రహదారుల పరిస్థితి
- పట్టించుకోని సంబంధిత అధికారులు



ఇందిరానగర్‌లో..



చెప్పల్ బజార్ రోడ్డు..

కాచిగూడ: కాచిగూడలో ఎటు చూసినా గుంతలు, గతుకుల రోడ్లే దర్శనమిస్తున్నాయి. లింగంపల్లి చౌరస్తా నుంచి చెప్పల్ బజార్ మీదుగా బాదర్ ఘాట్ వైపు వెళ్లే రోడ్డులో వెళ్లాలంటేనే భయమేస్తోందని స్థానికులు, పాదచారులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదో ఒక దారి కాదు డివిజన్‌లోని అనేక రహదారులు గుంతల మయంగా మారి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.

తవ్వారు.. వదిలారు ?

చెప్పల్‌బజార్ రహదారిపై ఇటీవల తవ్వకాలు పెరిగిపోగా.. సకాలంలో మరమ్మతులు జరగడం లేదని విమర్శలున్నాయి. ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. రద్దీ రహదారిపై ఇష్టానుసారంగా తవ్వి వదిలేయడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

ఆక్రమణలో సర్వీస్ రోడ్లు.. అవస్థల్లో ప్రజలు

కాచిగూడ డివిజన్‌లోని పలు రోడ్లకు ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్లను స్థానిక వ్యాపారులు, ఇతరులు వాహనాల పార్కింగ్ కోసం ఉపయోగిస్తున్నారు. దీంతో పరిసర బస్తీల, కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల ఫుట్‌పాత్‌లతో పాటు సర్వీస్ రోడ్డును పూర్తిగా ఆక్రమించి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితి ప్రజలకు ప్రమాదకరంగా మారింది. ఆక్రమణల గురించి అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షం వస్తే నడవలేని దుస్థితి..

రహదారులకు మరమ్మతులు చేయకపోవడంతో వర్షాలు పడినప్పుడు రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. దీంతో నడవ లేని పరిస్థితి నెలకొంటుంది. డివిజన్‌లోని బస్తీల్లో చాలా వరకు రహదారులు గుంతలు పడి కంకర తేలాయి.

సమన్వయ లోపంతోనే ఇబ్బందులు..

సకాలంలో జరగాల్సిన అభివృద్ధి పనులు వివిధ శాఖల మధ్య సమన్వయలేమి కారణంగా నిలిచిపోతున్నాయి. ప్రధానంగా జీహెచ్ఎంసీ, జలమండలి విభాగాల మధ్య అవగాహన, సఖ్యత లేని కారణంగా కొత్తగా వేస్తున్న రహదారుల నిర్మాణం, అదే సమయంలో అదే రోడ్డులో వేసే తాగునీటి, డ్రైనేజీ పైప్ లైన్ల నిర్మాణాలు అనుకున్న సమయంలో జరగడం లేదు. ఏదేమైనా అంతర్గత రహదారులు నిర్మించేలా కార్యాచరణ రూపొందించి పనులు జరిగేలా చూడాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టండి !

కాచిగూడ: అభివృద్ధి పనుల కోసం తవ్వి వదిలేసిన ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు వెంటనే చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కాచిగూడ డివిజన్ లింగంపల్లిలోని పలు ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ సిబ్బంది, అధికారులతో కలిసి పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో రోడ్లపై ప్యాచ్‌వర్క్ పనులను చేపట్టాలని ఆమె కోరారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా అధికారులు, సిబ్బంది చొరవ చూపాలన్నారు. జీహెచ్ఎంసీ ఏఈ కార్తీక, జలమండలి వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము, బీజేపీ నేతలు సుభాష్ పటేల్, భీమ్‌రాజ్, బల్వీర్, మిలింద్, భీమ్‌రాజ్, ఓంప్రకాష్, ఆర్. సంతోష్, ఎస్.రవియాదవ్ తదితరులున్నారు.



అధికారులతో కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

ముగిసిన 'నవరత్నమాల' సామూహిక సంకీర్తనార్చన



అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తున్న విద్యార్థులు

నల్లకుంట: వాగ్గేయ కారుడు శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల 615వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నల్లకుంటలోని శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'నవరత్నమాల' కార్యక్రమాలు ముగిశాయి. ఆదివారం కూర్మగిరి సుందర లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ ప్రాంగణంలో జరిగిన ముగింపు వేడుకల్లో ఆలిండియా రేడియో, దూరదర్శన్ కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణమూర్తి పర్యవేక్షణలో 100 మంది అకాడమీ విద్యార్థులు అన్నమయ్యకు అర్పించిన సామూహిక సంకీర్తనార్చన ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధా మూర్తి, ఆలయ ధర్మకర్త కిషన్‌రావులు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సామూహిక సంకీర్తనార్చనకు వర్ధమాన గాయని నందినిగాత్ర సహకారం అందించారు. కీ బోర్డుపై యామిని, తబలాపై ఆదిత్య, సుదర్శన్ వాద్య సహకారం అందించారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షులు ఎస్.రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నిరంజన్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం సుందరయ్య పార్కులో కామినేని ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, కోలస్ట్రాల్ తదితర పరీక్షలను చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కలుషిత వాతావరణం, ఆహార పదార్థాల వల్ల అనేక మంది అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నిత్యం వాకింగ్ చేయడంతో పాటు తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఉచిత శిబిరాల్లో నిర్వహిస్తున్న పరీక్షలను చేయించుకోవాలని సూచించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాఘవరెడ్డి, కృష్ణ, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వాకర్స్ సభ్యులు

పీఎంఓఏస్ అప్టోమ్స్ సేవలను పూర్తిగా వినియోగించుకోవాలి



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ప్రతినిధులు

కవాడిగూడ: రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో పనిచేస్తున్న (పీఎంఓఏస్) అప్టోమ్స్ సేవలను పూర్తి స్థాయిలో కొనసాగించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1500 కుటుంబాలను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఆప్తాల్మిక్ అసిస్టెంట్, అప్టోమెట్రిస్ట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, రత్నం నాగరాజులు ప్రభుత్వాన్ని కోరారు. దేశంలో ఎక్కడాలేని విధంగా మన రాష్ట్రంలో చేపట్టిన 'కంటి వెలుగు' అందరికి ఆదర్శంగా నిలిచిందన్నారు. గతంలో 2018లో, 2023లో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 1500 మంది సిబ్బంది పాల్గొని వైద్య సేవలు అందించారన్నారు. ఈ సేవలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పల్లె దవాఖానా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో తమకు ఉపాధి కల్పించాలని కోరారు. కంటి వెలుగు కార్యక్రమంలో పని చేస్తున్న పీఎంఓఏస్, అప్టోమ్స్ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని డిమాండ్ చేస్తూ.. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి 'తెలంగాణ రాష్ట్ర ఆప్తాల్మిక్ అసిస్టెంట్', అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించి ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఇందిరా పార్కు వద్ద తమ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని నినాదాలు చేశారు. అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాస్‌రావు, దేవ్‌నాయక్, ఆర్.శ్రీనివాస్, మనోజ్, రవి పాల్గొన్నారు.

వీసీ ప్రొ.సురేష్‌కుమార్ తీరు సరికాదు

ఉస్మానియా యూనివర్సిటీ: ద ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) వీసీ ప్రొ.సురేష్ కుమార్ తీసుకుంటున్న విద్యార్థి వ్యతిరేక నిర్ణయాలపై ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి ధ్వజమెత్తారు. ఆదివారం ఓయూ క్యాంపస్‌లోని డిస్కార్స్ సెంటర్‌లో ఎస్ఎఫ్ఐ ఇఫ్లూ కమిటీ ఆధ్వర్యంలో కన్వెన్షన్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఎల్ మూర్తి మాట్లాడుతూ.. వీసీ ప్రొ.సురేష్‌కుమార్ విద్యార్థి హక్కులను కాలరాసేల నిర్ణయాలు తీసుకోవడం దారుణమని, విద్యార్థి వ్యతిరేక చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలమైన వారిని సెంట్రల్ వర్సిటీలకు వీసీలగా నియమించి జాతీయ విద్య విధానం ముసుగులో విద్యను కాషాయికరణం చేస్తుందని ఆరోపించారు. ఉపకార వేతనాల్లో 58 శాతం కోత విధించి పేద విద్యార్థులను ఉన్నత విద్య దూరం చేస్తుందని ధ్వజమెత్తారు. సమాజంలో మనుధర్మశాస్త్రాన్ని అమలు చేసేందుకే బీజేపీ ప్రభుత్వం డార్విన్ జీవపరిణామ సిద్ధాంతాన్ని తొలగించారన్నారు.

డీడీ కాలనీలో అగ్ని ప్రమాదం.. ఆస్తి నష్టం

కాచిగూడ: బాగ్ అంబర్‌పేట్ డీడీ కాలనీలో నాలుగు అంతస్తుల భవనంలో అగ్నిప్రమాదం జరిగింది. అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. డీడీ కాలనీలోని ఆంధ్రాబ్యాంక్ చౌరస్తా సమీపంలో రాకేష్ అనే వ్యక్తికి నాలుగు అంతస్తుల భవనం ఉంది. కాగా నాల్గవ అంతస్తులో ఆయన నివసిస్తున్నాడు. జూబ్లీహిల్స్‌లో బంధువుల ఇంటికి శుభకార్యం నిమిత్తం బయటికి వెళ్లాడు. ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. స్థానికులు గమనించి 100కు డయల్ చేయగా.. పోలీస్ సిబ్బంది, ఫైర్ ఇంజిన్‌కు సమాచారమివ్వగా వారు మంటలను ఆర్పివేశారు. ఎస్సై మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్లో ప్రయాణిస్తున్న వ్యక్తి మృతి



కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి మరణించిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన సంబాజీ కుమారుడు గణేష్ (50) వాడి నుంచి కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైల్లో జనరల్ కోచ్‌లో చనిపోయాడు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి (20) మృతి చెందాడు. మృతుడి ఒంటిపైన యాష్ కలర్ ఆఫ్ టీషర్టు, జీన్స్ ప్యాంట్ ఉంది. మృతదేహాన్ని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

రైలులో నుంచి జారిపడి..

అడ్డగుట్ట: ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ జిల్లాకు చెందిన ఉమేష్ యాదవ్ (35), నగరంలో ఉన్న బంధువులను కలిసేందుకు ఈ నెల 5న రైలులో వస్తున్నాడు. చర్లపల్లి నుంచి ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ల మధ్య ప్రమాదవశాత్తు రైల్లోంచి నుంచిజారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆలస్యంగా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఆదివారం ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

పోలీస్ అధికారులకు రివార్డుల ప్రదానం

చిక్కడపల్లి: పలు కేసుల్లో ఉత్తమ ప్రతిభ కనపబరిచిన కేసులను ఛేదించిన పోలీస్ అధికారులు 13 మందికి నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంట్రల్‌లో రివార్డులను అందజేశారు. స్టేషన్ ఎస్‌హెచ్ఓ, ఇన్‌స్పెక్టర్ ఎన్.సంజయ్‌కుమార్, అడిషనల్ ఇన్‌స్పెక్టర్, డీఐ నరేష్, ఎస్సైలు సందీప్‌రెడ్డి, శశిపాల్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ సుశీల్ మిత్ర, కానిస్టేబుల్ ఆఫీసర్‌లు రామాంజనేయులు, శ్రీకాంత్, ప్రశాంత్, రమేశ్, రవీందర్, స్వామి, ప్రవీణ్‌రెడ్డి, ఉమెన్ పీసీ జోహ్రా ఫాతిమాలకు రివార్డులను సీపీ అందజేసి అభినందించారు. కాగా స్టేషన్ సిబ్బంది రివార్డులు పొందిన వారిని ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. తమకు రివార్డులు రావడంపై బాధ్యత మరింత పెరిగిందని క్రమశిక్షణతో పనిచేస్తామన్నారు.



సీఐ సంజయ్‌కుమార్‌కు రివార్డును అందజేస్తున్న సీపీ ఆనంద్

జీవో 14, 60లను అమలు చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వాటర్ బోర్డులో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వెంటనే జీవో 14, 60లను అమలు చేయాలని హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు నారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని బీఆర్ఎస్‌టీయూ రాష్ట్ర కార్యాలయంలో జీవో 14 ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరుతూ.. వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలో పనిచేసే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, జీహెచ్ఎంసీ కార్మికులు జీవో 14,60 ద్వారా వేతనాలు పొందుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండుసార్లు వేతనాలు పెంచిందని అదే శాఖ పరిధిలో పని చేసే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రైవేటు పరిశ్రమల్లో అమలయ్యే జీవో 11 ద్వారా తక్కువ వేతనాలు ఇస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి ఎండీ దానకిశోర్‌తో మాట్లాడి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. జీతాల పెంపు ప్రక్రియను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పలువురు హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ నాయకులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ఆర్యవైశ్యులు ముందుండాలి

కవాడిగూడ: సామాజిక సేవలో ఆర్యవైశ్యులు ముందుండాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా సూచించారు. ఆదివారం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ముషీరాబాద్ ఆర్యవైశ్య హాస్టల్‌లో సంఘం ప్రతినిధులతో కలిసి ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది పేద మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్‌లను అందజేశారు. అనంతరం గుప్తా మాట్లాడుతూ.. 33 జిల్లాల్లో ఐవీఎఫ్ బలోపేతం చేసేందుకు ఆర్యవైశ్యులు కృషి చేయాలన్నారు. ప్రిలిమ్స్ పాసై ఐఏఎస్ చదువుతున్న 25 మందికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయాన్ని ఆర్యవైశ్య సంస్థ అందజేసిందన్నారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ కేంద్ర కమిటీ సీనియర్ కార్యనిర్వాహక అధ్యక్షులు గంజి రాజమౌళిగుప్తాను ఆర్యవైశ్య ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, ఐవీఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పాండయ్యగుప్తా, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రమేష్, శ్రావణ్‌కుమార్, నగేష్‌గుప్తా, మేడ్చల్ జిల్లా కార్యవర్గ మహిళా విభాగం ప్రతినిధులు తదితరులున్నారు.



గంజి రాజమౌళిగుప్తాను సన్మానిస్తున్న ఆర్యవైశ్య ప్రతినిధులు

దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత



గణపతి కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ శివాలయం చౌరస్తాలో శ్రీగౌరీ శంకర ఆలయ ప్రాంగణంలో పునర్నిర్మించిన గణపతి కల్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రుద్రాభిషేకం, సుదర్శన యాగం, శివలక్ష్మి గణపతిహోమం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్మాత్మిక చింతన అలవర్చుకుని ఇతరులకు సహాయపడేలా నడచుకోవాలని సూచించారు. ముఠా జైసింహ, ఆలయ కమిటీ చైర్మన్ రామారావు, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌చారి, మండప కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, సత్యనారాయణ, శ్రీనివాస్‌రావు, బడుగు శ్రీనివాస్, నరేష్‌గౌడ్, బీజేపీ జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, బీపీపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జమల్‌పురి నందు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.విశ్వం, భోలక్‌పూర్, ముషీరాబాద్ డివిజన్ల బీఆర్ఎస్‌ల అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు, కె.నర్సింగ్‌ప్రసాద్ తదితరులున్నారు.

స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి చర్యలు



మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

కవాడిగూడ: నగరంలో ప్రసిద్ధిగాంచిన ఇందిరాపార్కులో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్ నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఆధునాతన హంగులతో స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం మున్సిపల్ అధికారులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి స్థలం కోసం పాదయాత్ర చేసి వాకర్స్, సందర్శకులు, అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఇందిరాపార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎ.సుధాకర్‌యాదవ్, బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ, మాజీ కార్పొరేటర్ రవీందర్, మున్సిపల్ అధికారులు గోపాల్, ఇందిరాపార్కు ఉద్యానవన శాఖ అధికారులు మౌనిక, శ్యామల, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వల్లాల శ్యామ్‌యాదవ్, ఎన్‌డీ సాయికృష్ణ, నగర నాయకులు వల్లాల శ్రీనివాస్‌యాదవ్, గొల్లగడ్డ రాజశేఖర్‌గౌడ్, ముచ్చకుర్తి ప్రభాకర్, రాంచందర్, రాజేష్, వల్లాల రవియాదవ్, విఠల్‌రావు, కిరణ్, రఫీయుద్దీన్, శ్రీనివాస్, మధు, మంజుల, రూప తదితరులున్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

నల్లకుంట: సీఐటీయూ ఆధ్వర్యంలో బాగ్‌అంబర్‌పేట శివంరోడ్డు లేబర్ అడ్డా వద్ద మన్యం దొర అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన కార్యక్రమానికి సీఐటీయూ నగర నాయకుడు మహేందర్, అంబర్‌పేట కన్వీనర్ రాములు రామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి మాట్లాడారు. తెల్ల దొరల తుపాకి గుళ్లకు ఎదురొడ్డి పోరాడిన గొప్ప ధీరుడు సీతారామరాజు అని కొనియాడారు. ప్రతీ కార్మికుడు సుఖంగా జీవించినప్పుడే సీతారామరాజుకు నిజమైన నివాళి అన్నారు. సీఐటీయూ నాయకులు నర్సిరెడ్డి, తిరుపతి, రాములు, భాస్కర్, సాయిలు, భూపాల్ రెడ్డి, కొండబాబు, లలిత తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

అల్లూరి ఆశయ సాధనకు నేటి యువత పాటుపడాలి..

కవాడిగూడ: స్వాతంత్ర్య సమరయోధుడు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు నేటి యువత పాటుపడాలని మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆదివారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఆయన విగ్రహానికి మంత్రి , మాజీ ఎమ్మెల్సే రుద్రరాజు పద్మరాజుతో కలిసి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివాసి గిరిజనుల కోసం అల్లూరి సీతారామరాజు ఎనలేని పోరాటం చేశారని దేశ స్వాతంత్రోద్యమంలో అల్లూరి పాత్ర ఎంతో గొప్పదన్నారు.